సాక్షి ప్రకాశం

శుక్రవారం ၊ 25 ၊ అక్టోబర్ ၊ 2024



రామ రామా.. ఇదేం పనయ్యా..?
మార్కాపురం మండల టీడీపీ నాయకుడు గోకులం పెద్దలో చేతివాటం చూపాడు. బినామీ పేర్లతో దరఖాస్తులు చేసి అధికారులపై ఒత్తిడి తేవడంతో ఆ పార్టీ నేతలే ఫిర్యాదు చేశారు. - IIలో..



చోరీ సొత్తు చాలక..
బైకులు దొంగిలించగా వచ్చిన నగదు సరిపోక గంజాయి అమ్ముతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2 కేజీల గంజాయి, 13 బైకులు స్వాధీనం చేసుకున్నారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కంభం ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి హెచ్చరించారు. అర్ధవీడు మండలంలోని మాగుటూరులో బెల్టు షాపు పెట్టుకునేందుకు వేలం పాట నిర్వహించడంపై 'బెల్టు దేవుడి పాట రూ.7.10 లక్షలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రిక స్టేట్ పేజీలో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ సీఐ స్పందించారు. గురువారం మాగుటూరు గ్రామంలో అనుమానిత వ్యక్తుల గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరైనా అనధికారికంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్ షాపు నిర్వహణ కోసం రూ.7.10 లక్షలకు వేలంపాట పాడిన వ్యక్తిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.

రేపటిలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు సిటీ: లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ (టీపీటీ/హెచ్‌పీటీ)లో ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పరీక్ష రాసేందుకు ఈ నెల 26వ తేదీలోగా సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లకు ఫీజు చెల్లించాలని డీఈఓ సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ.50తో ఈ నెల 31వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. మూడు సబ్జెక్టులకుపైగా ఉంటే పరీక్ష రుసుం రూ.150 అని, మూడు సబ్జెక్టుల్లోపు ఉంటే రూ.100 అని డీఈఓ వెల్లడించారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా ఓబులేసు



నూతన డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)గా బి.ఓబులేసును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓబులేసు గతంలో జిల్లాలో డీఆర్‌ఓగా పనిచేశారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో తెలుగు గంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై తిరిగి డీఆర్‌ఓగా నియమితులయ్యారు. ప్రస్తుతం డీఆర్‌ఓగా ఉన్న రామిశెట్టి శ్రీలతను జీఏడీ రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీఈఓగా కిరణ్‌కుమార్



డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)గా ఏ కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా బోయపాలెం డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా కిరణ్‌కుమార్ పనిచేస్తున్నారు. గతంలో తాడికొండ, గుంటూరు మండల విద్యాశాఖాధికారిగా ఆయన పనిచేశారు. సర్వశిక్షా అభియాన్‌లో ఏఎంఓగా పనిచేశారు. నరసరావుపేట, పర్చూరులో డీవైఈఓగా పని చేశారు. శనివారంగానీ, సోమవారంగానీ డీఈఓగా కిరణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

ఆర్థిక వృద్ధి రేటు పెంచేందుకు ప్లాన్ చేయాలి

ఒంగోలు అర్బన్:

స్వర్ణాంధ్ర-2047 నాటికి ఆర్థిక వృద్ధి రేటు పెంచేలా మండల, జిల్లాల విజన్ ప్లానింగ్ పక్కాగా ఉండాలని, ఆ మేరకు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ కలెక్టర్లకు సూచించారు. స్వర్ణాంధ్ర విజన్–2047 ప్రణాళికల అమలుపై గురువారం అమరావతి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో కీలక రంగాలపై దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఫైనల్ డ్రాఫ్ట్ డాక్యుమెంట్‌ను ఈ నెల 26వ తేదీ రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) వెంకటేశ్వర రావు, పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి, డీఎం హెచ్‌ఓ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మందు.. ఇంటి ముందుకే



అధికార బలంతో మద్యం దుకాణాలు దక్కించుకున్న టీడీపీ నాయకులు బరితెగించారు. ఊళ్లని మత్తులో ముంచెత్తేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అడుగుకో బెల్టు దుకాణం ఏర్పాటుకానున్నాయి. పెట్టుబడికి సరిపడా ఆదాయం కోసం నిర్వాహకులు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రైవేటు మద్యం పుణ్యమా అని వీధి చివర.. ఇంటి పక్కన దుకాణాలు వెలుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా వెయ్యికిపైగా బెల్ట్‌షాపులు ఏర్పాటుకానున్నట్టు సమాచారం. వీటిపై ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

- ఊరూరా బెల్ట్ షాపులకు రంగం సిద్ధం
- అధికార పార్టీ నేతల ఆశీస్సులతో దుకాణాలు
- జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా ఏర్పాటుకు యత్నాలు
- అర్ధవీడులో బహిరంగ వేలం వేసిన తమ్ముళ్లు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- పాత రోజులు గుర్తుకువస్తున్నాయని మహిళల ఆవేదన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో మద్యం ఏరులను పారించేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి గ్రామానికీ మద్యం పంపిణీ చేసేందుకు ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన పాలసీ ప్రకారం ప్రైవేటు మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేయగా, బెల్ట్ షాపుల ఏర్పాటుకు అధికార పార్టీ నేతలు అనుమతులిస్తున్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 171 మద్యం దుకాణాలు ఉండగా, మద్యం దుకాణాల కోసం 3,466 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో దరఖాస్తుకు 2 లక్షల రూపాయల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించేందుకు కూడా వెనకాడలేదు. కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి లైసెన్సులు మంజూరు చేశారు. అప్పుడు లైసెన్సులు దక్కని కొందరు తమ్ముళ్లు పట్టువదలని విక్రమార్కుల్లా ఇప్పుడు బెల్ట్ షాపుల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

2014 రిపీట్...

2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనలో బెల్టు షాపులను ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేయడం తెలిసిందే. అప్పుడు ప్రతి మద్యం దుకాణానికి అనుబంధంగా కనీసం 5 నుంచి 10 బెల్టుషాపులను ఏర్పాటు చేయడం జరిగింది. కొన్ని గ్రామాల్లో దేవుడి పేరుతో వేలం వేసి మరీ బెల్టు షాపులు నిర్వహించారు. ఇప్పుడు కూడా అదే తరహాలో వేలం వేస్తున్నట్లు సమాచారం. పశ్చిమ ప్రకాశం జిల్లాలోని మారుమూల ప్రాంతమైన అర్ధవీడు మండలంలోని మాగుటూరు గ్రామంలో ఇటీవల బెల్ట్ షాపు కోసం బహిరంగ వేలం నిర్వహించడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చు. గ్రామస్తుల సమక్షంలో దేవుడి పేరు మీద వేలం నిర్వహించగా, 7.10 లక్షల రూపాయలకు గ్రామానికి చెందిన రామసుబ్బయ్య దక్కించుకున్నారు. వేలం పాడిన వ్యక్తి ఎమ్మార్పీ కంటే 50 రూపాయల వరకు అధిక ధరలకు విక్రయించుకునేందుకు అనుమతి ఇవ్వడం గమనార్హం. ఈ వేలం సంగతి ఆ నోటా ఈ నోటా పత్రికలకు ఎక్కడంతో ఉలిక్కిపడిన ఎక్సైజ్ అధికారులు, పోలీసులు వెంటనే మాగుటూరు చేరుకుని గ్రామస్తులపై చర్యలు తీసుకున్నారు. గురువారం గ్రామస్తులకు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గంగమ్మ సెంటర్‌లో బెల్ట్‌షాప్ ఏర్పాటును గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో బెల్టు దుకాణాలు వెలుస్తున్నట్టు సమాచారం.

ఎవరి రేటు వారిదే...

ప్రభుత్వం, పాలక పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు నిరుపేద, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లు పెట్టే మద్యాన్ని ఆదాయ వనరుగా భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాల దరఖాస్తుల దగ్గర నుంచే గల్లా పెట్టి పట్టుకుని కూచుంది. ఒక్కో దరఖాస్తుకు 2 లక్షల రూపాయలు వసూలు చేయడమే కాకుండా ఒక్కో లైసెన్సీ నుంచి 55 లక్షల రూపాయల నుంచి 65 లక్షల రూపాయల వరకు ముక్కుపిండి వసూలు చేసింది. దీనికితోడు అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు 20 నుంచి 30 శాతం వరకు కప్పం కట్టాల్సిందేనంటూ హుకుం జారీ చేసినట్టు సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి మద్యం దుకాణం నిర్వహించే వ్యాపారికి కేవలం 20 శాతం మాత్రమే మార్జిన్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలోనే మద్యం అక్రమ విక్రయాలకు పునాదులు పడ్డాయని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. లైసెన్సు పొందిన వ్యాపారులు గ్రామ జనాభా, వ్యాపారాన్ని బట్టి 7 నుంచి 15 లక్షల రూపాయల వరకు బెల్టుషాపులకు ధరలు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ప్రజలపై కోట్లాది రూపాయల భారం...

మద్యం వ్యాపారం కోసం పెట్టిన పెట్టుబడులు, ఆ తర్వాత దుకాణం నిర్వహణకు అయ్యే ఖర్చులు, ప్రజాప్రతినిధులకు, ఎక్సైజ్ శాఖ, పోలీసులకు నెలవారీ మామూళ్లు కలుపుకుని ఒక్కో దుకాణదారుడికి ఏడాదికి 2 కోట్ల రూపాయల వరకు ఖర్చు వస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన మొత్తం 171 దుకాణాలకుగానూ ఏడాదికి 342 కోట్ల రూపాయల వరకు నిరుపేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. నూతన మద్యం పాలసీ ప్రకటించినప్పటి నుంచి మహిళా సంఘాలు ఇది నిరుపేదల సంపదను కాజేసే పాలసీనేగానీ మరొకటి కాదని చెబుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే పాత రోజులు గుర్తుకు వస్తున్నాయని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

పంచాయతీకో బెల్టు షాపు...

జిల్లాలో మొత్తం 729 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 22.88 లక్షల మంది జనాభా ఉన్నారు. అందులో మహిళలు 11.27 లక్షల మందిని తీసేస్తే మిగిలిన 11.61 లక్షల మంది పురుషులు ఉన్నారు. పురుషుల్లో ఎక్కువ మందిని తాగించడమే లక్ష్యంగా అనధికార మద్యం దుకాణాలు ఏర్పాటవుతున్నట్టు సమాచారం. అనధికారికంగా మరో వేయి వరకు బెల్ట్ దుకాణాల ఏర్పాటుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. వీటి ద్వారా దొడ్డిదారిన మద్యం వ్యాపారం చేసేందుకు వ్యాపారులు సన్నాహాలు చేసుకుంటున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ప్రతి పంచాయతీకి ఒక బెల్ట్ షాపు ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఒక ఎక్సైజ్ ఉద్యోగి తెలిపారు.

బెల్ట్ షాపు కోసం తరలిస్తుండగా..

- 30 మద్యం బాటిళ్లు పట్టివేత

బేస్తవారిపేట: బెల్ట్ షాపు కోసం తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను బేస్తవారిపేట ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి గురువారం పట్టుకున్నారు. పందిళ్లపల్లెకు చెందిన ఒక వ్యక్తి అక్రమంగా క్వార్టర్ బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, అమ్మినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అలాంటి వారి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై రవీంద్రారెడ్డి

29, 30 తేదీల్లో సివిల్ సర్వీసెస్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా స్త్రీ, పురుషుల జట్లను ఈ నెల 29, 30 తేదీల్లో స్థానిక మినీ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి గుంటి రాజరాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, హాకీ, క్రికెట్, రెజ్లింగ్, క్యారమ్స్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, మ్యూజిక్, డ్యాన్స్ అండ్ షార్ట్‌ప్లే, బెస్ట్ ఫిజిక్ పోటీలు ఉంటాయన్నారు. 30న బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు సంబంధిత కార్యాలయ అధిపతి నుంచి తమ పేరు, హోదా తెలియజేసే కార్డు, ఆధార్‌కార్డు, ఎంప్లాయీ ఐడీ, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. క్రీడా దుస్తుల్లోనే రావాలని కోరారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు విజయవాడ, గుంటూరులో నవంబరు 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9121106840 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రశస్త యాప్‌పై నేడు ఆన్‌లైన్ ఓరియంటేషన్

ఒంగోలు సిటీ: జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, స్పెషల్ టీచర్లు, భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్లకు ప్రశస్త మొబైల్ యాప్ వినియోగంపై ఈ నెల 25వ తేదీ ఆన్‌లైన్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సీఈఆర్టీ ద్వారా ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఓరియంటేషన్ జరుగుతుందని, అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ప్రశస్త యాప్ వినియోగం, ఉపయోగాలు, స్క్రీనింగ్ విధానం, సాంకేతిక సమస్యల పరిష్కారం, తదితర విషయాలు తెలుసుకునేందుకు ఓరియంటేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. యూట్యూబ్ చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్న ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లింక్‌ను ఇప్పటికే మెయిల్, వాట్సాప్ ద్వారా పంపించినట్లు తెలిపారు. ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని వారంతా ఆన్‌లైన్ ఓరియంటేషన్‌లో పాల్గొనే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని డీఈఓ సూచించారు.

వివిధ పోస్టులకు 58 దరఖాస్తులు

ఒంగోలు సిటీ: జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు మొత్తం 58 దరఖాస్తులు వచ్చినట్లు డీఈఓ సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 గడువు తేదీ ముగిసే నాటికి ఆయా పోస్టులైన కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ పోస్టుకు 17 దరఖాస్తులు, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ పోస్టుకు 8, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కో ఆర్డినేటర్ పోస్టుకు14, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుకు 2, ఎంఎల్ఎస్ అండ్ పీఎల్‌జీ కో ఆర్డినేటర్ పోస్టుకు 9, ఏఎస్ఓ పోస్టుకు 8 చొప్పున మొత్తం 58 దరఖాస్తులు వచ్చినట్లు డీఈఓ వివరించారు.

అల్లర్లకు పాల్పడితే సహించేది లేదు

- ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో కురిచేడు మండలంలోని దేకనకొండ గ్రామంలో జరిగిన ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసులో అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చిన వారికి ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్పీ.. అల్లర్లు, గొడవలు సృష్టిస్తే సహించేది లేదని వారిని హెచ్చరించారు. పవిత్రమైన పండుగలను సంతోషంగా జరుపుకోకుండా అనవసరంగా గొడవలకు పాల్పడి గ్రామానికి చెడ్డపేరు తీసుకొచ్చారంటూ మందలించారు. ఎవరైనా సరే దాడులు, గొడవలకు పాల్పడితే పీడీ యాక్టు పెడతామని, చట్టపరంగా ఇతర కేసులను కూడా నమోదు చేస్తామని చెప్పారు. కేసుల్లో ఇరుక్కుని భార్యాపిల్లలకు దూరంగా ఉండాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కేసుల్లో ఇరుక్కుని పోలీసు రికార్డులో పేరు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు కూడా రావని, పాస్ పోర్టు, వీసాల వంటివి కూడా రావని అన్నారు. సమాజంలో గౌరవం కోల్పోయి అన్నివిధాలుగా నష్టపోతారంటూ ఎస్పీ హితవు పలికారు. గ్రామాలు ప్రశాంతంగా ఉన్నప్పుడే, ప్రజలంతా కలిసిమెలిసి పనులు చేసుకున్నప్పుడే అభివృద్ధి చెందుతారని, సుఖశాంతులతో జీవితాన్ని గడుపుతారని చెప్పారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. కౌన్సెలింగ్‌లో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ జి.అస్సన్, కురిచేడు ఎస్ఐ శివ పాల్గొన్నారు.



నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ దామోదర్

కోర్టును తప్పుదోవ పట్టిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

- వీఓఏలను తొలగించలేదంటూ కోర్టుకు వివరణ
- వారిని తొలగించామంటూ నేడు మరో మాట
- ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర
- అధికార పార్టీ ఒత్తిళ్లతోనే మాకు అన్యాయం జరిగిందంటున్న వీఓఏలు
- పీడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి (సింగరాయకొండ): 'మీరు విధుల్లో ఉన్నారు కదా.. మిమ్మల్ని ఎప్పుడు తొలగించాం ..? ఏపీఎంకు చెబుతా.. విధుల్లో చేరండి' అంటూ బుధవారం తనను కలిసిన వీఓఏలతో డీఆర్‌డీఏ పీడీ వసుంధర అన్నారు. కానీ, ఒక్కరోజులోనే గురువారం ఆమె మాట మారిపోయింది. 'మిమ్మల్ని తొలగించాం కదా.. మళ్లీ ఎందుకు వస్తున్నారు' అంటూ తనను కలిసేందుకు గురువారం కార్యాలయానికి వెళ్లిన వీఓఏలతో అనడంతో వారు అవాక్కయ్యారు. తమకు న్యాయం చేయాలంటూ జరుగుమల్లి మండలం జయలక్ష్మి గ్రూపు వీఓఏ కొండూరు జీవనజ్యోతి, నాగలక్ష్మి గ్రూపు వీఓఏ కోనూరి రాములమ్మ, స్త్రీనిధి గ్రూపు వీఓఏ నలమాల శ్యామల పీడీని కోరారు. తమ సమస్యకు పరిష్కారం చూపాల్సిన పీడీ వసుంధర.. తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తే ఇంకెవరికి చెప్పుకోవాలంటూ వారు ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి జరుగుమల్లి ఏపీఎంగా విధులు నిర్వహించిన భాగ్యలక్ష్మి ఒక్క గ్రూపు మీటింగు కూడా పెట్టకుండా, నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన నోటీసులు ఇవ్వకుండా ఆగస్టు 30వ తేదీ వీఓఏలు ముగ్గురినీ కార్యాలయానికి పిలిపించి సెప్టెంబర్ 1వ తేదీ నుంచి వేరే వారిని విధుల్లోకి తీసుకుంటున్నామని, మిమ్మల్ని తొలగిస్తున్నామని తమకు చెప్పినట్లు వారు వెల్లడించారు. మీ వద్ద ఉన్న రికార్డులు అప్పగించాలని ఆదేశించారని, తీర్మానం రిజిష్టర్ తప్ప మిగతా పుస్తకాలు కార్యాలయంలో అందజేశామని వీఓఏలు తెలిపారు. ఆ తర్వాత గ్రామ టీడీపీ నాయకులు సూచించిన వారిని విధుల్లో చేర్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ గ్రూపులను ఏ గ్రేడ్‌లో నిలిపామన్నారు. 17 సంవత్సరాలుగా గ్రూపు సభ్యులకు సహాయ సహకారాలు అందించి వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సహకారం అందించామన్నారు. కానీ, ఏపీఎం భాగ్యలక్ష్మి టీడీపీ పెద్దల ఆదేశాలతో ఒక్క రోజులోనే తమను విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఆ సమయంలో వీఓఏలను తొలగించలేదని, వారి విధులకు ఆటంకం కలిగించలేదని పీడీ వసుంధర కోర్టుకు వివరణ ఇచ్చి తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తాము తప్పు చేస్తే తొలగించాలని, అంతేగానీ ఎటువంటి ఆరోపణలు లేకుండా అధికార పార్టీ పెద్దల మెప్పు కోసం ఏ విధంగా తొలగిస్తారని బాధిత వీవోఏలు ప్రశ్నిస్తున్నారు. మాకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఇటీవల కొత్తగా వచ్చిన ఏపీఎం జయరాజ్ ఒంగోలు వెళ్లి పీడీతో మాట్లాడి మాకు న్యాయం చేస్తామని చెప్పారని, కానీ, ఎక్కడికి వెళ్లాడో తెలియలేదని, ఆయన కూడా మొహం చాటేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



గురువారం ఒంగోలులో డీఆర్‌డీఏ పీడీ వసుంధరను కలవడానికి వేచి ఉన్న వీఓఏలు

పీడీ వసుంధరపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

హైకోర్టును తప్పుదోవ పట్టించి తన ఇష్టం వచ్చినట్లు సమాఖ్య నిబంధనలు తుంగలో తొక్కి టీడీపీ నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర ద్వంద్వ వైఖరిపై కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. గురువారం తాను పీడీ వసుంధరతో ఫోన్‌లో మాట్లాడానని, వీఓఏలను చేర్చుకోవాలని కోరానని చెప్పారు. కానీ, వారిని విధుల్లో నుంచి తొలగించామని ఆమె అంటున్నారన్నారు. అలాంటప్పుడు వీఓఏలను తొలగించలేదని, వారి విధులకు ఆటంకం కలిగించలేదని కోర్టుకు ఎలా చెప్పారని, తీర్మానం పుస్తకం వారి వద్ద ఉంటే మీరు ఏ విధంగా కొత్త పుస్తకంలో తీర్మానం రాస్తారని ప్రశ్నించగా, పీడీ వద్ద సమాధానం లేదని ఆదిమూలపు సురేష్ తెలిపారు. అన్యాయంగా తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం ప్రకాశం భవనంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏ ప్రాంతంలో ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు ఉన్నాయి, వాటికి అవసరమైన ఎరువుల డిమాండ్ ఎంత ఉంది, మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు ఎంత సరఫరా అవుతోందనే అంశాలపై ప్రతిరోజూ నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉద్యానవన పంటలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి రైతులకు ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి గోపీచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఎన్‌ఫోర్స్‌మెంట్ పటిష్టంగా పనిచేయాలి



సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: రేషన్ సరుకుల పంపిణీ, సరఫరాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది మరింత పటిష్టంగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం ప్రకాశం భవనంలో పౌరసరఫరాల శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీల అనంతరం ఆ శాఖకు కొత్తగా వచ్చిన అధికారులతో చర్చించారు. రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం లేకుండా చూడాలన్నారు. పంపిణీకి సంబంధించి ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. రేషన్ సరుకులు అక్రమ రవాణా జరగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఎస్ఓ పద్మశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.కోటి విలువైన డ్రగ్స్ పట్టివేత

కొరుక్కుపేట : కస్టమర్‌లా నటిస్తూ పోలీసులు రూ. కోటి విలువైన డ్రగ్స్‌తో పాటు ఆంధ్రా యువకుడిని పట్టుకొని అరెస్టు చేశారు. కొద్దిరోజుల క్రితం అరుంబాక్కం ప్రాంతంలో డ్రగ్స్ విక్రయానికి సంబంధించి దీపన్, డోలి మేలా అనే జంటలను అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు బెంగళూరుకు చెందిన సంతోష్, పశ్చిమాఫ్రికాకు చెందిన అబిడ్ క్లాషన్ కూడా పట్టుబడ్డారు. వీరిపై చేపట్టిన విచారణలో ఒంగోలుకు చెందిన విశ్వనాథ్ ఈ ప్రాంతం నుంచి చెన్నైలోని వినియోగదారులకు హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు డ్రగ్స్ విక్రేతైన విశ్వనాథ్‌ను ఆధారాలతో పట్టుకొని అతడి వద్ద నుంచి కిలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొన్నారు. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని తెలుస్తోంది. చెన్నైలో అరెస్టయిన విశ్వనాథ్‌కు డ్రగ్స్ ముఠాలతో సంబంధాల గురించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం వెలికితీత


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

దర్శి: భార్యతో గొడవపడి సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న షేక్ రఫి(38) మృతదేహాన్ని పోలీసులు గురువారం బయటకు తీశారు. వినుకొండకు చెందిన షేక్ రఫీకి..దర్శికి చెందిన సాదియాతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. బుధవారం మధ్యాహ్నం రఫీ తన భార్యకు వీడియో కాల్ చేసి నేను సాగర్ కాలువలో దూకుతున్నానని చెప్పి చెప్పులు, సెల్‌ఫోన్ గట్టుపై పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం కాలువలో గాలించినా మృతదేహం కనిపించలేదు. గురువారం మృతదేహాన్ని ఎస్‌కేజే పవర్ ప్రాజెక్ట్ వద్ద కాలువలో నుంచి బయటకు తీశారు. ఎస్సై మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


ఏడుకొండలు మృతదేహం

కురిచేడు: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..స్థానిక బోయపాలేనికి చెందిన అంకె ఏడుకొండలు(27) రోజు మాదిరి పొలం కాపలకు వెళ్లాడు. పంట పొలాలకు వేసిన విద్యుత్ కంచె కనిపించక చీకట్లో తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం శివ తెలిపారు.

మనస్తాపంతో బాలుడు ఆత్మహత్య


పోచ్చాలు మృతదేహం

పుల్లలచెరువు: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని తెల్లగట్ల గ్రామంలో గురువారం జరిగింది. తెల్లగట్ల గ్రామానికి చెందిన చిలకాబత్తుని పోచ్చాలు(17) అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం సమయంలో ఆటో నడుపుతుండగా ఎదురుగా వచ్చిన వ్యక్తికి ఆటో తగిలింది. ఆటో తగిలిన వ్యక్తి పోచ్చాలు తిట్టడంతో మనస్తాపానికి గురై ఇంటికి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. చేతికి అందివచ్చిన కుమారుడు తనువు చాలించడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.

మతిస్థిమితం లేని మహిళపై కర్రతో దాడి

- ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళ హత్య జరిగినట్లు సోషల్ మీడియాలో ప్రచారం
- ఉలిక్కిపడిన పోలీసు అధికారులు, ప్రజలు

ఒంగోలు టౌన్: ఆమె ఒక మతిస్థిమితం లేని మహిళ. సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుంది. ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు. బస్టాండ్ చుట్టుపక్కల భిక్షాటన చేసి రాత్రయ్యే సరికి ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుగుతుంటుంది. అక్కడ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులపై చిందులు వేయడం, అరవడం చేస్తుంది. బుధవారం రాత్రి ఆమె నేను కానిస్టేబుల్‌ను అని చెబుతూ చేతిలో ఉన్న కర్రతో ప్రయాణికులను అదిలిస్తుంది. ఈ క్రమంలో బస్టాండు లోపల 2వ నెంబరు దుకాణం నిర్వహించే దాసరి నాగరాజు దగ్గరకు వచ్చిన ఆమె నువ్వెరంటూ కర్రతో ఒక దెబ్బ వేసినట్లు తెలుస్తుంది. దంతో అగ్గిమీద గుగ్గిలమైన నాగరాజు అదే కర్రతో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. మతిస్థిమితం లేని మహిళలే అన్న కనికరం కూడా చూపకుండా కర్రతో చితకబాదాడు. ఈ దృశ్యాన్ని సెల్ ఫోన్లో చిత్రీకరించిన ఒక వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇది సంచలనం సృష్టించింది. మహిళను కర్రతో కొట్టి హత్య చేసినట్లు ప్రచారం జరగడంతో పోలీసులు, ఆర్టీసి అధికారులు సిబ్బంది ఉలిక్కిపడ్డారు. దాడిలో దెబ్బలు తిన్న సదరు మతిస్థిమితంలేని మహిళ ఆ తరువాత ఎటు వెళ్లిందో తెలియలేదు. మతిస్థితిమితం లేని మహిళపై దాడి చేసిన నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సిఐ వై. నాగరాజు తెలిపారు.

రామ రామా.. ఇదేం పనయ్యా..?


దరిమడుగులో గతంలో మంజూరైన గోకులం షెడ్లు

- గోకులం షెడ్లలో టీడీపీ నేత చేతివాటం
- బినామీల పేర్లతో దరఖాస్తులు
- గత టీడీపీ ప్రభుత్వంలోనూ 3 గోకులాలు ఆయనకే..
- పార్టీ నేతల ఫిర్యాదుతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

మార్కాపురం రూరల్:

ప్రజల సొమ్మును అప్పనంగా దోచేయడంలో టీడీపీ నేతలకు పెట్టింది పేరు. సంక్షేమ పథకాలు, సబ్సిడీ పథకాలు ఏ పథకానైనా తమకు అనుకూలంగా మార్చుకొని దోచుకుంటారు. ఇందుకు తాజా ఉదాహరణ గోకులం షెడ్లు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల్లో పశుసంరక్షణ కోసం గోకులం షెడ్లను మంజూరు చేశారు. ఇందులో పశుపోషకుల కోసం 75 శాతం సబ్సిడీ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారుల కోసం 70 శాతం సబ్సిడీతో గోకులాల నిర్మాణానికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. ఈ పథకంలో 2 ఆవుల గోకులం యూనిట్ ధర రూ.1.15 లక్షలు కాగా రైతు చెల్లించాల్సింది 10 శాతం రూ.11,500 మాత్రమే. మిగిలిన 90 శాతం ప్రభుత్వమే భరించి షెడ్లు నిర్మించి ఇస్తుంది. ఇక 4 ఆవుల గోకులం యూనిట్ ధర రూ.1.85 లక్షలు కాగా రైతుల వాటా రూ.18,500 చెల్లించాలి. 20 మేకలు, లేదా గొర్రెలు యూనిట్ ధర రూ.1.30 లక్షలు అయితే రైతుల వాటా రూ.39 వేలు చెల్లించాలి.

బినామీ పేర్లతో దరఖాస్తులు

గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనూ గోకులం షెడ్లు టీడీపీ నేతలకే మంజూరయ్యాయి. అయితే మార్కాపురంలో మాత్రం మండలస్థాయి నాయకుడు మరింత అత్యుత్సాహం ప్రదర్శించాడు. మార్కాపురం మండలానికి గోకులం షెడ్ల నిర్మాణానికి 90 దరఖాస్తులు రాగా వాటిలో 41 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపించారు. వాటిలో 31 దరఖాస్తులను ఎంపిక చేశారు. వీటిని జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద నిర్మిస్తారు. పథకాన్ని మంజూరుచేసేది మాత్రం పశుసంవర్ధక శాఖ అధికారులు. ఇక్కడే మండల స్థాయి టీడీపీ నేత రంగప్రవేశం చేశాడు. మార్కాపురం నుంచి దేవరాజుగట్టుకు వెళ్లే హైవేరోడ్డుపై ఉన్న ఓ గ్రామానికి చెందిన టీడీపీ నేత సుమారు 10 గోకులాలను తన బినామీలతో నింపి దరఖాస్తులు పూర్తి చేసి అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రతిపాదనలు సిద్ధం చేశాడు. మండల పరిషత్ కార్యాలయానికి చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారి జాబితా తీసుకొని ఎమ్మెల్యే వద్దకు వెళ్లడంతో ఆయన వివరాలు తెలుసుకుని అవాక్కయ్యాడు. వెంటనే సదరు టీడీపీ నేతకు ఫోనులో చీవాట్లు పెట్టాడు. అన్ని గ్రామాల్లో నీకెం పనంటూ మందలించి తనకు తెలీయకుండా జాబితా ఇవ్వొద్దంటూ అధికారులను ఆదేశించారు. దీంతో సదరు మండల స్థాయి టీడిపి నేత కినుకు వహించాడు. ఈ విషయం మండల స్థాయి టీడీపీలో చర్చనీయాంశమైంది. విచిత్రమేమిటంటే ఆ టీడీపీ నేత ఊర్లో ఇప్పటికే 3 గోకులాలు ఉండగా మంజూరైన 10 గోకులాల కాంట్రాక్టు తనకే దక్కించుకునేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. కాగా తమకు తెలియకుండా ఇటీవల కాలంలో సదరు టీడీపీ నేత రేషన్ మాఫియాతో పాటు ఇలా ప్రభుత్వ కాంట్రాక్టులు కూడా దక్కించుకోవడం ఏంటని ఎమ్మెల్యేకు పలువురు టీడీపీ నేతలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆయనో మండలస్థాయి టీడీపీ నాయకుడు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆయన పంట పండినట్లే..బినామీలను పెట్టుకొని సబ్సిడీ పథకాలను మొత్తం లాగేసుకొని ప్రభుత్వ సొమ్మును దోచుకుంటాడు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ ఇలానే దోచుకున్న సదరు టీడీపీ నేత..అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే మళ్లీ దోపిడీ మొదలుపెట్టాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సబ్సిడీతో నిర్మించనున్న గోకులం షెడ్లకు తన బినామీలతో 10 దరఖాస్తులు పెట్టించి వాటిని మంజూరు చేయించుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. విషయం ఎమ్మెల్యే దృష్టికి చేరడంతో ఆయన సదరు టీడీపీ నేతకు చివాట్లు పెట్టినట్లు తెలిసింది.

గ్రామాల వారీగా గోకులాల మంజూరు ఇలా...

గ్రామం	మంజూరైన గోకులాలు
దరిమడుగు	10
ఇడుపూరు	8
నాయుడుపల్లి	4
బోడపాడు	4
రాయవరం	5
మొత్తం	31

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఏకేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి


ఎంపికైన ఏకేయూ కబడ్డీ జట్టు

ఒంగోలు: విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ అన్నారు. గురువారం ఏకేయూ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఐసీటీ(అంతర కళాశాలల పోటీలు) కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు కబడ్డీ పోటీలను యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర్, సీఈ డాక్టర్ కేవీఎస్ రాజు, ఏకేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్‌లతో కలిసి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు ప్రారంభించారు. ఈ పోటీలకు ఐదు కళాశాలలకు చెందిన ఆరు జట్లు పాల్గొనగా ఏ.కే.యూ టీము సెలక్షన్ కమిటీ సభ్యులు ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ గంటా సాయి సురేష్ క్రీడాకారులను యూనివర్శిటీ అధికారులకు పరిచయం చేశారు. గురువారం సాయంత్రం జరిగిన ఫైనల్ పోటీల్లో సింగరాయకొండకు చెందిన పీఎన్‌సీపీ డిగ్రీ కళాశాల జట్టుపై ఒంగోలు ఆంధ్రకేసరి విద్యా కేంద్రం డిగ్రీ కళాశాల బి టీము 34 -17 స్కోరుతో విజయం సాధించారు. అనంతరం గెలుపొందిన టీంకు, ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరుపున తొలిసారిగా అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొనే 12 క్రీడాకారులను ఎంపిక చేసి, వారికి బహుమతులను అందజేశారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ నిర్మలా మణి మాట్లాడుతూ ఆటపోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం 12 మంది క్రీడాకారులతో కూడిన ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్ జట్టును ప్రకటించారు. ఈ జట్టు ఈ నెల 30 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు చెన్నైలోని ఎస్.ఆర్.ఎం.యూనివర్శిటీలో జరిగే ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్ పోటీలలో పాల్గొననున్నారు.

ఏకేయూ జట్టు:

డి.గోపి రాజు, బి.సాయిరామ్, బి.చందు, డి.మదన్, బి.భానుప్రసాద్, జి.రహీం, వైవీ నితిన్, ఎస్.మణిరెడ్డి, సీహెచ్ శివ, ఎం.పవన్ నాగేంద్ర, డి.సాయి కిరణ్ ఏ. నోవీన్ కుమార్‌రెడ్డిలతో బాటు స్టాండ్ బై ప్లేయర్లుగా పి.మహేష్, జి.అశోక్, వి.అజయ్‌బాబులను ఎన్నుకున్నారు.

నేటి నుంచి పశుగణన

- జిల్లాలో 6,12,564 గృహాల్లో లెక్కింపు
- 348 మంది ఎన్యుమరేటర్లు, 71 మంది సూపర్‌వైజర్లు
- 2025 ఫిబ్రవరి ఆఖరు తుది నివేదిక

కనిగిరి రూరల్: జిల్లాలో ఇంటింటి పశు గణన కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఐదేళ్లకు ఒక సారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో పశు గణన నిర్వహించి.. తదనుగుణంగా వివిధ రకాల కార్యక్రమాలు అమలు చేస్తారు. ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, ఒంటెలు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు, కోళ్లు, ఇలా అన్ని రకాల మూగ జీవాల లెక్కింపు చేస్తారు. ఈ గణాంకాల అధారంగానే పశువర్ధక శాఖ, అనేక పథకాల రూపకల్పన, టీకాలు, వ్యాక్సినేషన్, పాడి రైతుల పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, రాయితీ పథకాలు తదితర వాటిని అమలు జరిపేందుకు సమగ్ర కార్యచరణలు జరుగుతాయి.

జిల్లాలో 6,12,564 గృహాల్లో లెక్కింపు

జిల్లాలోని అన్ని మండలాల్లో పశు గణన లెక్కింపు కార్యక్రమం 6,12,564 గృహాల్లో జరుగుతుందని పశువర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబి రాణి తెలిపారు. ఈ మేరకు పశుగణన జరిగిన ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటిస్తారని, సిబ్బందికి కూడా ఐడీ కార్డులను అందచేశామన్నారు. రూరల్‌లో 4,97,438 గృహాల్లో, అర్బన్‌లో 1,15, 134 గృహాలు పశుగణన లెక్కింపు జరుగుతుంది. దానికి సంబంధించి రూరల్‌లో 235 మంది, అర్బన్‌లో 113 మంది మొత్తం 348 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు రూరల్‌లో 64 మంది, అర్బన్‌లో 7 మంది మొత్తం 71 మంది పనిచేస్తారు. ఏడీలు, డీడీలు, వీఏఎస్‌లు పర్యవేక్షణ సాగుతుంది. ఇప్పటికే పశుగణన సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ లోగా గణన పూర్తి చేసి తుది నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందచేయనున్నట్లు జేడీ తెలిపారు.

చోరీ సొత్తు చాలక..గంజాయి అమ్మకంలోకి..

- గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులు అరెస్టు
- 2 కేజీల గంజాయి, 13 మోటారు సైకిళ్లు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన సీఐ హజరత్తయ్య



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: వారంతా స్వతహాగా మొటార్‌సైకిళ్ల దొంగలు. కానీ మోటార్‌సైకిళ్లు దొంగిలించి వచ్చే అరకొర ఆదాయంతో వారు సంతృప్తి చెందలేదు. గంజాయి విక్రయిస్తే డబ్బులు బాగా వస్తాయని ఆ వ్యాపారంలోకి దిగారు. కానీ ఆదిలోనే హంసపాదులా చివరికి కటకటాలపాలయ్యారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కేజీల గంజాయి, 13 మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ సీహెచ్ హజరత్తయ్య వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేటకు చెందిన కుంభా గోపి, ఉయ్యాల రవిలు ఇద్దరు చాలా కాలంగా మోటారుసైకిళ్ల దొంగతనం చేసి వాటిని మోటుమాల గ్రామానికి చెందిన కోడూరి సుబ్బారెడ్డి, జె.పంగులూరు గ్రామానికి చెందిన రాగిబోయిన వాసుబాబుకు రూ.5 వేల నుంచి రూ.10వేలకు విక్రయిస్తూ కాలం గడిపేవారు. చాలాసార్లు జైలుకు కూడా వెళ్లివచ్చారు. అయితే మోటారుసైకిళ్ల చోరీతో తమ కనీస అవసరాలు తీరడం లేదని గంజాయి వ్యాపారం చేయాలని ఆలోచించారు. ఈ సమయంలో వీరికి గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన చుక్క నాగగోపిచంద్ తారసపడ్డాడు. వీరు ముగ్గురు కలిసి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకుని ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దుకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి వద్ద రెండు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. గురువారం మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని విమానాల రన్‌వే జాతీయ రహదారి పక్కన ఉన్న పోలేరమ్మ గుడి వద్ద కలిసి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ప్యాకెట్ రూ.200 చొప్పున విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర చాకచక్యంగా వీరిని అదుపులోనికి తీసుకున్నారు. తరువాత విషయాన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావుకు వివరించి వారి ఆదేశాల ప్రకారం లోతుగా విచారణ జరిపామన్నారు..ఈ క్రమంలో విచారణలో కోడూరి సుబ్బారెడ్డి వద్ద 5, రాగినబోయిన వాసుబాబు వద్ద 3 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని మరో మోటారుసైకిల్‌ను ఒక దొంగ వదిలేసి వెళ్లడంతో గతంలో స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఆయన వివరించారు. గంజాయి కేసును చాకచక్యంతో పరిష్కరించిన సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్రను ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. ఏఎస్సై షేక్ మహబూబ్‌భాషా, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: రబీ సీజన్ వరి పంటకు సంబంధించి 2024-25 సంవత్సరానికి రైతులు పంట బీమా చేయించుకోవాలని, డిసెంబర్ నెలాఖరులోపు చేసుకునేలా సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులకు సూచించారు. అమరావతి నుంచి వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశంభవనం నుంచి కలెక్టర్, జేసీ ఆర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం లెక్టర్ ఆయా శాఖ అధికారులతో చర్చించారు. వరి పంటకు డిసెంబర్ 31వ తేదీ లోగా, జొన్న, శనగ, మినుము, మొక్కజొన్న, మిరప పంటలకు మాత్రం డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రభుత్వం నిర్ణయించిన బీమా ప్రీమియం చెల్లించేలా చూడాలన్నారు. పంట రుణాలు తీసుకునే సమయంలో ప్రీమియం డబ్బును బ్యాంకులు మినహాయించుకునేలా రైతులు అంగీకారం తెలపవచ్చని, రుణాలు తీసుకొని వాళ్ల విడిగా కూడా చెల్లించవచ్చని తెలిపారు. సీపీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి గోపిచంద్, వ్యవసాయ శాఖ ఏడీ, అధికారులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం కేసులో నిందితుడిపై పోక్సో నమోదు

- పోలీసుల అదుపులో నిందితుడు ?

ఒంగోలు టౌన్: ఒకవైపు తల్లితో సహజీవనం చేస్తూనే మరోవైపు 15 ఏళ్ల నిండని ఆమె కూతురిని ప్రేమపేరుతో లొంగదీసుకున్న ప్రబుద్ధిడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. టంగుటూరు మండంలోని పొందూరు గ్రామానికి చెందిన మహిళ భర్తతో దూరంగా ఉంటూ తాపీ పనులు చేసుకొని జీవిస్తుంది. రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ఇండ్ల రాముతో పరిచయమైంది. అతడు కూడా తాపీ పనులు చేస్తుంటాడు. వీరి పరిచయం కాస్త సహజీవనానికి దారి తీసింది. మహిళకు ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. పెద్ద కూతురు ఒంగోలులోని ఒక పాఠశాలలో పదో తరగతి చదువుకుంటుంది. ప్రతిరోజూ రాము ఆ బాలికను తన మోటార్ బైకుపై తీసుకొని వచ్చి స్కూలులో వదిలిపెట్టేవాడు. ఈ క్రమంలో ఆమెపై కన్నేసిన ఆ ప్రబుద్ధుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి బుట్టలో వేసుకున్నాడు. 7 నెలల కిత్రం ఆ బాలికను తనతో పాటుగా హైదరాబాద్ తీసుకెళ్లి అత్యాచారాం చేశాడు. ఆ తరువాత బాలిక ప్రవర్తనలో వచ్చిన మార్పు గమనించిన ఆమె తల్లి అతడికి దూరంగా ఉంచడం మొదలుపెట్టింది. ఈ నెల 21వ తేదిన బాలికను స్కూలు నుంచి తీసుకొని వెళ్లిపోయాడు. హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్కూలు నుంచి బాలిక ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన సదరు మహిళ ఒంగోలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన బాలికను పోలీసులు తీసుకొని వచ్చి వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు తరలించారు. నిందితుడిపై పోక్సో, లైంగిక దాడి కేసులను నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుడు రాము పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. కానీ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

స్పా ముసుగులో వ్యభిచారం

ఒంగోలు టౌన్: మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న స్పా సెంటర్‌పై దాడి చేసిన పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...నగరంలోని గుంటూరు రోడ్డులో గుప్తాస్ మిడ్ టౌన్‌లో ఉన్న సారా స్పా సెంటర్‌పై గురువారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన పోలీసులకు వ్యభిచారం చేస్తున్న ఇద్దరు విటులు పట్టుపడ్డారు. వారితో పాటుగా నిబంధనలకు వ్యతిరేకంగా మసాజ్ చేస్తున్న ఇద్దరు మహిళలను హోంకు తరలించారు. వీరితో పాటుగా స్పా సెంటర్ నిర్వాహకులు పవన్, అజయ్‌లతో పాటుగా విటులపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కె. అజయ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకే స్పా పై దాడులు చేసి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ స్పా సెంటర్ నిర్వాహకుల్లో ఒకరు తణుకు చెందిన వ్యక్తిగా తెలుస్తుంది. అతడు ఏడాదికి రూ.25 లక్షలు చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలుస్తుంది.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ పోటీలు


అపెక్స్ హైస్కూల్‌లో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థు


ఆంధ్రా హైస్కూల్‌లో పరీక్షరాస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్‌బీ మొదటి లెవల్ పోటీలు గురువారం స్థానిక అపెక్స్ హైస్కూల్, ఆంధ్రా హైస్కూల్‌లలో ఉత్సాహంగా జరిగాయి. మొదటి లెవల్‌లో నాలుగు కేటగిరీలు కింద పోటీలు నిర్వహించారు. పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ పోటీలను అపెక్స్ హైస్కూల్ కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి, ఇన్‌చార్జి అనూరాధ, టీచర్లు ప్రవల్లిక, రమాదేవి, వనజాకుమారి, పీఈటీ రవి, ఆంధ్రా హైస్కూల్ కరస్పాండెంట్ బొమ్మల శ్రీనివాసరావు, టీచ వి.కోటేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, సాక్షి యాడ్స్ విభాగం మేనేజర్ శర్మ, ప్రతినిధి హనుమంతరావులు పర్యవేక్షించారు.

అర్ధరాత్రి వేళ అపార్టుమెంట్‌లోకి..

- పట్టుకొని పోలీసులకు అప్పగింత

దర్శి: అర్ధరాత్రి అపార్టుమెంట్‌లోకి వచ్చి అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే..స్థానిక అద్దంకి రోడ్డులోని అపార్టుమెంట్‌లోకి బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఓ అనుమానితుడు చొరబడ్డాడు. సదరు వ్యక్తి సమీపంలోని న్యూడిల్స్ పాయింట్ వద్ద బైక్ పార్కు చేసి అపార్టుమెంట్‌లోకి వచ్చి లిఫ్ట్ వద్ద కారు చాటున నక్కాడు. గమనించిన వాచ్‌మెన్ అపార్టుమెంట్‌లోని వారికి ఫోన్ చేసి పిలిచాడు. వారంతా కిందకు వచ్చి వ్యక్తిని పట్టుకొని ప్రశ్నించారు. అయితే పొంతన లేని సమాధానం చెబుతుండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితున్ని అదుపులోనికి తీసుకొని ప్రశ్నించాడు. అయితే నిందితుడు తనది ముండ్లమూరు మండలం పులిపాడు గ్రామంగా చెప్పాడు. మద్యం మత్తులో ఏం తెలియక ఇక్కడకు వచ్చానని చెప్పడంతో పోలీసులు సదరు వ్యక్తి సంబంధించిన వారి ఫోన్ నంబర్లు తీసుకొని గురువారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పి పంపించారు. అయితే కొన్ని రోజులుగా చెడ్డీ గ్యాంగ్ జిల్లాలో సంచరిస్తుండటంతో అపార్టుమెంట్ వాసులు ఆందోళనకు గురయ్యారు.

ఉప్పలదిన్నెలో దళితుల భూముల పరిశీలన

- లబ్ధిదారులను విచారించి వివరాలు స్వీకరించిన రెవెన్యూ అధికారులు


ఉప్పలదిన్నెలో దళితుల భూములు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: మండలంలోని ఉప్పలదిన్నెలో 25 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న భూమిపై స్థానిక టీడీపీ నేతల కన్ను పడింది. అధికారులను అడ్డుపెట్టుకొని కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలోకి దళితులను వెళ్లవద్దంటూ గ్రామంలో రెవెన్యూ అధికారులతో దండోరా వేయించారు. దీంతో దళితులను ఇబ్బందులకు గురిచేస్తున్న స్థానిక టీడీపీ నాయకులు, మంత్రి స్వామి, రెవెన్యూ అధికారుల తీరుపై బుధవారం సాక్షి పత్రికలో 'దళితుల భూములపై పచ్చ గద్దలు'అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి స్థానిక రెవెన్యూ అధికారులను క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో ఆర్ఐ నరసయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఉప్పలదిన్నెలోని దళితుల భూములను పరిశీలించారు. అలాగే లబ్ధిదారులను విచారించి వారి వద్ద నుంచి అర్హత పత్రాలు తీసుకుని రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. దళితుల భూములను రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారని, గతంలో వీరికి అంజేసిన పట్టాల రికార్డులను పరిశీలించామని, నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దార్ పుల్లారావు తెలిపారు.